# చాటు ఉడుతలు

బాల్జాక్ 'బంగారుకళ్ళ పిల్ల' (ప్యారిస్) దౌర్భాగ్యమంతా ఈ ఊరికి తు.చ తప్పకుండా వర్తిస్తుంది. డబ్బు, విలాసం ఈ రెండే జీవితానికి అర్థాల్లా కనిపిస్తున్నాయి. హడావుడి, ఆత్రుత, ఎగబడి వస్తువుల్ని కొనుక్కోవడం, పైసాపైసా డబ్బు లెక్కెట్టుకోవటం, పరుగు నడకలు, వాహనాల మీద కుమ్ముకోబోతున్నట్లు ప్రయాణాలు, చెవులు బద్దలవుతూ మెదడుకు పక్షపాతం వచ్చేట్లు శబ్దాలు—గదిలో ఒంటరితనం భరించలేక బహిర్ప్రపంచంలోకొస్తే కనబడే మార్పుండని దృశ్యం. అయితే, ఒంటరితనం, నిశ్శబ్దం లేకపోతే పిచ్చెత్తిచ్చేగోల, ఒక మనిషి పాదాలు మరొకర తొక్కుకుంటు పరుగులు. ప్రత్యామ్నాయం లేదు. మధ్యేమార్గం లేదు. ఒంటరితనం భరించలేనంత విసుగనిపించినపుడు రెండవ దాన్ని ఆశ్రయించడం, రెండవది భరించలేని స్థితిలో ఒంటరితనంలో గడపటం. ఎప్పటిలా బయటి ప్రపంచంలోకి వచ్చి ఫుట్‌పాత్‌మీద జన ప్రవాహంలో కొట్టుకు పోతున్నాను ఆ రోజూ.

మార్కెట్టు దగ్గిర కొ[illegible] చూశాను.

చంపబడిన ఉడుతల్ని. అయితే అవి జీవం పుట్టి పడుతున్నాయి. లోపల ఏదో కూరి నైపుణ్యంతో కుట్టి జీవం వున్న భ్రాంతి కలిగించ బడుతున్నాయి. తలకొద్దిగా ఎత్తి పడమటి ఆకాశాన్ని చూస్తున్నాయి. జీవంలేని ఆ కళ్ళు డ్రాయింగ్ రూములకు పనికి వచ్చేలా చేయబడ్డాయి. జీవంతో వున్నపుడు ఎవరికీ సొంతం కావడానికి, ఒకచోట కదిలిక లేకుండా పడివుండటానికి అవకాశం లేదు. ఇపుడు ఆ రెండింటికీ వీలుంది. అలంకార వస్తువులుగా పనికొస్తాయి. అవి బేరమాడుతూ కనపడ్డారు కొంతమంది. చూడటానికి వాటిలో కళవుంది. జీవం అక్కరలేదు, జీవం పుట్టి పడుతుంది. వాటిని చూస్తుంటే భక్తి, ప్రేమ అమాయకత గుర్తుకొస్తున్నాయి. వాటి అచేతనం వెనుక హృదయంలేనితనం మనసులో మెదిలింది. కాళ్లు ఆ దృశ్యం ముందు నుంచి లాక్కుపోగానే అది తెరమరుగుకు పోయింది. రోడ్డు చివరదాకా నడిచి, అటునుంచి కాలినడకన వచ్చే ఓపికలేక ఆ రెండు కిలో మీటర్లదూరం బస్సెక్కివచ్చి భోంచేసి నిద్రపోయాను. అయితే ఆ ఉడుతల ప్రహసనం కొంతకాలానికి జీవితంలో జరిగిన ఒక అనుభవ సందర్భంలో గుర్తుకొచ్చింది. దానికి ఆ అనుభవ సంబంధమైన అంశాలకు చాలా పోలికలు కనపడ్డాయి.

ఆ రోజు తర్వాత కొద్ది నెలలకు శేషాచలంతో పరిచయమయింది. అప్పుడు శాస్త్రీయ సంగీతమంటే నాకు ల్యాటిన్, గ్రీకు. ఇప్పటికీ ఆ విషయంలో పాండిత్యమేమీరాలేదు. నా పరిచయస్తులంతా సరిగమలు తెలీకపోయినా దాన్ని గురించి మైమరిచి మాట్లాడు



కోవడం, కచేరీలకు హాజరవుతుండటం, తొడలు చరుచుకోవడం, తలలుఊపడం చూసి నేనూ వాత పెట్టుకోదలుచుకున్న రోజులు. శాస్త్రీయ సంగీతంలో పరిచయం లేని కారణంగా ఎవరన్నా పాడుతున్నపుడు లోటుపాట్లు తెలీవు. మొదట సినిమా పాటలకు, లలిత సంగీతానికి పరిచయమైనది నా సంగీతాభిలాష. క్రమంగా కొద్దికాలంలోనే మార్పువచ్చింది. అవి మొహం మొత్తి. వినడానికి ఇంపుగా వుంటోంది శాస్త్రీయ సంగీతం. లోటుపాట్లతో సంబంధం లేకుండా వినాలని పిస్తోంది. సంగీత కచేరీల కొచ్చే జనాలని పరిశీలించడం ఒక వింత ఆనందం కలిగిస్తోంది. అందుకని వాటికి హాజరవడం మొదలు పెట్టాను.

ఆ రోజు సంగీత విద్వాంసుడు పాడేదానికన్నా అంగ విన్యాసం విసుగనిపించి, పోయి బయటికొచ్చి కొంతదూరం నడిచి ఒక ఇంటి ప్రహారీగోడకు ఆనుకుని నిలబడి సిగరెట్ తాగుతున్నా. తన వెనకనే వచ్చిన ఒక వ్యక్తి తన దగ్గరగా ఆగి తనంతట తానే పలకరించాడు.



'విసుగ్గా వుంది కార్యక్రమం. ఆ ముఖ కవళికలు, తలా, చేతులు కదపటం నవ్వు పుట్టిస్తోంది.' అన్నాడు నేనూ అదే అభిప్రాయాంలో వున్నానన్న నిశ్చయాని కొచ్చి.

'అవును. సంగీతం పరవాలేదనుకుంటా.'

ఒప్పుకుంటూ, 'ఇలాంటి కచేరీల్లో కళ్లు మూసుకుని వినడమే మందు' అన్నాడు.

పరికించి చూశా అతన్ని. గ్లాస్కోపంచె, లాల్చీ— వక్కపొడి నములుతున్నాడు. ముప్పై ఎనిమిది— నలభై వయసుంటుంది. తెల్లటి ఛాయ. బొద్దుగా వున్నాడు. చక్కటి పలువరుస. పక్కపాపిటి తీసి వెనక్కుదువ్విన జుత్తు. అక్కడక్కడా తెల్లవెంట్రుకలు చోటుచేసుకున్నాయి. పొడవుగా వుండి సూదిమొనగా అంతమైన ముక్కు. దళసరి కనుబొమలు. బుగ్గలు మొహానికి అవసరమైన దానికన్నా కొద్దిగా ఎక్కువగా వున్నట్లని పిస్తాయి జాగ్రత్తగా గమనిస్తే. చూడగానే మంచి అభిప్రాయం కలిగింది.

కొంతసేపు పిచ్చాపాటి మాట్లాడిన తర్వాత, అతని గానం అయిపోయుంటుంది, తర్వాత కార్యక్రమం ఎట్లావుంటుందో చూద్దామా' అన్నాడు. ఇద్దరం హాలు వైపు నడుస్తున్నపుడు చెప్పేడు, తనూ గతంలో సంగీత కార్యక్రమాలు ఇస్తుండేవాడినని. హాల్లో పక్కపక్కన కూర్చున్నాం. శాస్త్రీయసంగీతంలో నాకు పరిచయం లేదని, అయితే వినడం ఇష్టమని చెప్పాను. 'సంగీతాన్ని ఆస్వాదించడానికి దాని లోతులు తెలియక్కర లేదు లెండి' అని భరోసా ఇచ్చాడు శేషాచలం. కార్యక్రమం అయిన తర్వాత ఒకరిగురించి ఒకరం చెప్పుకుని విడిపోయాం.

ఒక నెలరోజుల తర్వాత యాదృచ్ఛికంగా బజార్లో తారసపడ్డాం. అతన్ని నా గదికి రమ్మని పిలిచాను. వచ్చాడు. గంటకు పైగా గడిపాం. తన ఊరు రమ్మని పిలిచాడు. ఈ ఊరునుంచి మూడుగంటల ప్రయాణం. అందులో గంటన్నర ఘాటీలో వెళ్లాలి. ఆ పనీ, ఈపనీ పడినపుడు ఈ ఊరొస్తుంటాడు. వస్తానని చెప్పేను. ఆ రాత్రికే మరో వూరు వెళుతున్నాడట. నాల్రోజుల్లో తిరిగి ఈ ఊరొచ్చి తన ఊరు వెళతాడు. అపుడు ఇద్దరూ కలిసి వెళ్ళొచ్చు. అతను అన్నట్లే అయిదో రోజు నా గదికి వచ్చాడు. ప్రయాణం అయ్యాం.

మూడు గంటల తర్వాత మమ్మల్ని దింపి, దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది డొక్కు బస్సు. బస్సులు ఊళ్లోకి వెళ్లడం లేదు. ఊళ్లోకి తెచ్చే రోడ్డు రిపేరులో వుంది. దిగిన రోడ్డు ప్రక్కల పొదలు. బ్రహ్మజెముడు నాగజెముడు చెట్లు దట్టంగా రోడ్డు కిరువైపులా. చెరొక బ్రీఫ్ కేసుతో నడుస్తున్నాం. అతను చెబుతున్నాడు.

'నాకు నాలుగయిదేళ్ల వయసుంటుంది. (అంత చిన్నప్పటి విషయాలు కూడా నాకు గుర్తుండి పొయ్యాయెందుకో). మా మామయ్య హార్మోనీలు తయారు చేస్తుండే వాడు. ఆయన అపుడపుడు తొక్కుడు హార్మోనీ వాయిస్తూ పద్యాలు పాడటం నాకు గుర్తు. ఒక చిన్న హార్మనీ రీడ్సు కొన్ని పోయి అటకమీద లేప్‌గా పడివుండేది. ఆ తర్వాత ఆరేళ్ల వయసులో

నవులూరి వెంకటేశ్వరరావు

నాన్న చనిపోవడం జరిగింది. బంధువుల ఇంట అమ్మా నేమా గడిపాం. ఎత్తైన ఓకు బల్లమీద వీణ పెట్టి వుండేది. వయ్యారం పదార్థ రూపం పొందినట్లు పదిహేను రోజులు దూరం నించి చూసి చూసి ఇక ఉండలేక దగ్గరకెళ్లి తీగలు మీటాను. ఘనకార్యం చేసినట్లు పొంగిపోతున్న సమయంలో ఇంట్లో వాళ్ళు హాల్లోకి బిలబిలమని పరుగెత్తు కొచ్చారు. అత్యాచారం చేసినట్లు హడావుడిచేశారు. విష్టారంగా మాట్లాడారు అమ్మతో. ఆమె నా వీపు చిట్లగొట్టింది. (అర్ధరాత్రి ఎందుకో మెలుకువ వచ్చి చూస్తే బెక్కుతూ, నా జుత్తు సవరిస్తూ, ముఖం లోకి చూస్తు కనిపించింది.) అవి నా సంగీత సంబంధమయిన మొట్ట మొదటి బాల్య జ్ఞాపకాలు. జీవితపు వైఫల్యాల మాలలో సంగీతం కూడా చేరిపోయింది.'

'వైఫల్యమేం?' సంగీతం నేర్చుకున్నారు. కచేరీలూ ఇచ్చారుగా.'

'సంగీతం నేను నేర్చుకున్నది చాలా తక్కువ. సముద్రం నించి చారెడు తీసుకున్న దానితో సమానం నేను నేర్చుకున్నది. కచేరీలంటారా అది చాలాకాలం నాటిమాట. నా కచేరీలు నాకే నచ్చక మానేశా.'

కొద్ది క్షణాలు ఊరుకుని అన్నాడు. 'రెండేళ్ళు పేయింటింగ్ నేర్చుకున్నాను. సంవత్సరం పాటు రంగులు పులిమాను క్యాన్‌వాస్ మీద. ఆ సరదా తీరిపోయింది. నా స్థానం తెలిసొచ్చింది. చివరకు నేను నేర్చుకున్న పాఠమేమిటంటే కళాస్వాదనకు తప్ప కళా సృష్టికి పనికిరానని.'

అతనిలోని నమ్రతకు ముచ్చటేసింది. అతని బాల్య సంఘటనలు, సంగీత పరమైన. అసంతృప్తి జాలి కలిగించాయి. మాటలు మార్చడం మంచిదేమోనన్న ఉద్దేశ్యంతో నాగురించి రెండు ముక్కలు చెప్పా.

'నా గురించి ముందే చెప్పేను. మనం మాట్లాడుతున్న విషయంలో ఓనమాలు రావని. దాన్ని నేర్చుకోవాలని, వినాలని మాత్రం వుంది. ఓపిక లేదు. నా సామర్థ్యం మీద నాకు నమ్మకం లేదు. నిజానికి సాహిత్య రంగంలోకి అడుగుపెడుదామని రచనలు చేయ ప్రయత్నించా. కొన్నాళ్లకే నా సామర్థ్యం నాకు తెలిసిపోయింది. సాహిత్యం చదవడం వరకే పరిమితం చేసుకున్నా. అయితే చదివింది కూడా చాలా తక్కువని ఒప్పుకోవాలి.'

ఒక పెద్ద ప్రహారీగోడ దగ్గర కొచ్చాం. ఏడెనిమిదడుగుల ఎత్తైన అయిదడుగుల వెడల్పైన ద్వారం. 'ఇదే మా సౌధం' అన్నాడు. లోపలికి అడుగు పెట్టాం. దగ్గర

దగ్గర 1500 చదరపు గజాల ఖాళీ స్థలం. దాని తర్వాత పెద్ద ఇల్లు. రాతి కట్టడం. ముందు ఎత్తైన మెట్లు. మెట్లెక్కి వరండాలో కొచ్చాం. గుమ్మం దగ్గర చెప్పులు వదిలాం. వరండాలోకి రెండు పక్క పక్క గదుల ద్వారాలున్నాయి. ఎడమ వైపు గుమ్మానికి కట్టిన తెర గుమ్మం పరిపడా ఎవరో సవరించారు. పొడవాటి వేళ్లు, నీలంగాజులు క్షణం కనపడి మాయం అయ్యాయి. గలగల చప్పుడుతో సహా.

ఆ గదికి పక్కనున్న గదిలోకి అతను దారి తీశాడు. అతని వెనక నేను నడిచాను లోపలికి. కూర్చోమని చెప్పి ఆ గది వెనుక గదిలోకి వెళ్లి మాయమయ్యాడు. ఒకమూలనున్న తెల్లటి, శుభ్రంగా ఉతికి వేసిన క్యాన్‌వాస్ గుడ్డ గల పడక కుర్చీలో వాలాను. దానికి ఎడమ ప్రక్కన ఎత్తుగావున్న, గుండ్రటి టీపాయ్, రోజ్ వుడ్‌ది— దానిమీద తెల్లటిదే గుడ్డ పరుచబడివుంది. మధ్యలో ఎంబ్రాయిడరీ చేయబడిన డిజైన్ మీద అందంగా వంపు తిరిగిన వాజ్. దాంట్లో (బహుశా పొద్దునకోసిన) కాగితపు పూలు ఎర్రటివి, నీలంవి, తెల్లవి. నాలుగు గోడలకు ఆయిల్ పెయింటింగ్స్. ఒక గోడకు బొద్దు మీసాల వ్యక్తి నిలువెత్తు పటం. దవడ ఎముకలు బలంగా స్ఫుటంగా కనిపిస్తున్నాయి. చూపుల్లో ధీమా, గర్వం. రింగురింగుల ఒత్తు జుత్తు. చాలాకాలం నాటి ఆయిల్ పెయింటింగ్. కళ్ళు మాత్రం అపుడే చిత్రించబడ్డట్లు మిలమిల మంటున్నాయి. ఒక మూల పెద్ద ట్రంకు పెట్టె. దానిమీద ప్యాకేజి పెట్టెలు. వాటిపై కట్టలు కట్టలుగా కట్టి పేర్చిన కాగితాలు. మరొక మూల రెండు తలుపులకు నిలువు టద్దాలు బిగించిన, పాలిష్ చేయబడ్డ బీరువా. స్టీలు హ్యాండిల్ నిగనిగలాడుతోంది. దాని పక్కనే వున్న బల్ల మీద ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేయబడ్డ ఆట్లాస్ బొమ్మ, దాని పరసనే తళతళమనేట్లు తోమబడిన ఒళ్లు విరుచుకుంటున్న నగ్న స్త్రీ కంచు విగ్రహం.

అన్ని వస్తువుల మధ్య ఎలాంటి ప్రత్యేకత లేకపోయినా వింతగా తోచాయి పూలు. ఏదో చెప్పటానికి నోరుతెరచి, వద్దనుకుని మూసుకుని ఎప్పటి మా నాన్నే దాల్చినట్లు.

'ఎట్లావుంది మా ఇల్లు.'

'ఇంకా పూర్తిగా చూడకుండానే?' అనబోయి 'బాగుంది' అన్నాను.

గదిలో నించి మళ్లీ బయటికి వెళ్లాడు. అతను మాట్లాడటం వినిపిస్తోంది. అయితే ఏం మాట్లాడుతున్నది తెలీడం లేదు. సన్నటి గొంతు సమాధానం చెబుతోంది. కొంచెం తక్కువ స్థాయిలో రోగంతో మంచమెక్కి నీరసపడ్డ వీణ తీగల బలహీనపు ధ్వనిలా.

నేనున్న గదిలోకి తిరిగివచ్చి అన్నాడు.

చెప్పేగా, ఇది స్వంత ఇల్లుకాదు. పన్నెండు గదుల ఇల్లు. మాయ జమాని తండ్రి కట్టించాడు. తలుపులకు, ద్వార బంధాలకు రోజ్‌వుడ్ వాడబడింది. రోజ్ వుడ్డంటే వెర్రి ఇష్టమట ఆయనకు. ఒకానొకపుడు ఈ పన్నెండు గదుల ఇల్లు పిల్లా, పెద్దలతో కళకళ లాడేదట. ఇపుడు నలుగురమే వుంటున్నాం.' రేపు యజమాని వచ్చి బయటికి నడువూ అంటే కట్టు బట్టలతో, చంకి చాప చంకన పెట్టుకుని బయటికి పోవాలి.'

'పదిహేనేళ్ల నించి ఇక్కడే వున్నట్టున్నారు—' అతనే గతంలో చెప్పింది గుర్తుకు తెచ్చుకుని అన్నాను.

'మీ ఉద్దేశ్యం అర్థమైంది. పదిహేనేళ్లుగా జరగంది ఇపుడు జరుగకూడదని లేదుగా. పదిహేనేళ్లుగా డిమోక్లజ్‌గారి ఖడ్గపు అస్తిత్వాన్ని అనుక్షణం గురుంచుకుంటూనే వున్నాం.'

'అయినా ఇంతకాలంగా ఈ పరిసరాలలో ఈ ఇంటి పురాతనపు ఆప్యాయతలో వుండటం ఒక అనుభవం కదూ.'

నవ్వేదు ఏమిటి కవిత్వం చెబుతున్నాడన్నట్లు నేనూ నవ్వాను.


'స్నానానికి లేవండి. కొండన్న టవలు, బట్టలు స్నానాల గదిలో పెడతాడు. దారి చూపిస్తాడు.'

అతను వెళ్లిపోయిన కొంత సేపటికి కొండన్న వచ్చాడు, నవ్వుతూ. ఒంటి కన్ను. కంటికేమయిందో. చిన్నప్పటినుండి ఉన్న వైకల్యామా మధ్యలో వచ్చిందా?


కుర్చీమీద పడేసిన గ్లాస్కో పంచ, లాల్చి, తువ్వాలు తీస్తూ ఇవేనా పట్టుకెళ్లాల్సినవి అని అడిగాడు. అతను దారి చూపిస్తుంటే వెనకనే నడిచాను.

స్నానం ముగించి వచ్చేసరికి 11 గం. అయింది.

'మీరు క్షమించాలి అర్జంటు పనిమీద ఒంటిగంటకు బయటికి వెళ్లాల్సిన పని బడింది. సాయంత్రానికి రావడానికి ప్రయత్నిస్తాను. కొండన్న మీకు తోడుగా వుంటాడు' అన్నాడు శేషాచలం గదిలోకి వస్తూ. వెళ్లిబోతూ' అన్నట్లు, మీ కాలక్షేపానికి ఆ బీరువా నిండా పుస్తకాలున్నాయి, తిరిగెయ్య వచ్చు.' బీరువా తాళం వేసి లేదు. తలుపు తీస్తే కుదిరికగా సర్దబడ్డ పుస్తకాలు తనకు పేర్లు తెలిసిన రచయిత లైన టాల్‌స్టాయ్, దాస్తొవిస్కీ, ఛెకోవ్, జోలా, మొపాసా మొదలైన



వాళ్లేగాక పరిచయం లేని రచయిత లెందరివో మనో సంతానం ఎవరో మాడ్దానికొచ్చారన్నట్టు మేల్కొంది. 'డెడ్ సోల్స్' తీసి అది అసంపూర్తిగా మిగిలిపోవడానికి గల కారణాలను, వ్యక్తిపే లిటుటుకుంటూ రెండు పేజీలు చదివాను నిలబడే. పుస్తకాన్ని యాధాస్థానంలో వుంచి దాని పక్క దేంటో చూస్తే 'ది బ్రదర్స్ కరమ్ జోవ్' (అంట్లాంటి ప్లాట్ అల్లడం మానవమేధస్సుకు సాధ్యపడేదేనా?) పై అరలో పుస్తకాల పేర్లు చూస్తుంటే 'ది మూన్ అండ్ సిక్స్ పెన్స్' కనిపించింది. ఇదివరకు చదివినదే అయినా ఆఖరు పేజీలు మరోసారి చదవాలనిపించింది. అది తీసుకుని బీరువా తలుపులు మూసి మంచం మీద కూర్చున్నా.




ఛార్లెస్ స్ట్రిక్ ల్యాండ్‌లో రాగాద్వేషాలు లేవు. సిరత్వానికి ఔన్నత్యానికి స్థానం లేదు. మానవత్వపు విలువలు లేవు. దుర్భరదారిద్ర్యంలో ఆదుకుంటు వచ్చిన స్నేహితుడి పట్ల కటువుగా ప్రవర్తిస్తుంటాడు. రోగంతో తీసుకుంటున్న అతనిని తన ఇంటికి తీసుకుపోయి సేవలు చేస్తూ ఆ రుణాన్ని ఆ స్నేహితుడి పెళ్లాన్ని లేపుకుపోవడం ద్వారా తీర్చుకుంటాడు. ఆమె కొన్నాళ్లకు ఆత్మహత్య చేసుకోవడం అతనిలో ఎలాంటి కదలిక కలిగించదు. జీవిత ధ్యేయం ఒకటే సృష్టి. కళాసృష్టి. ప్రయోజనం— అతనికే పూర్తిగా తెలీదు. లేకపోతే ఆఖరు దినాల్లో—నాగరికతకు దూరంగావుంటూ కుష్ఠువ్యాధితో బాధపడుతూ, కళ్లు పోయే ముందు (చావుకు ముందు) సృష్టించిన కళాఖండాన్ని తన తదనంతరం తగులబెట్టమని చెప్పాల్సిన పని లేదు. స్వార్థమే పరమార్థం. తనలోని తపనని సంతృప్తి పరచడానికే. ప్రకృతి దాచుకున్నవి, ఎవరికీ తెలీనివి అయిన లోతులు వెదికి— భయం కలిగించేవి, ఆనందం కలిగించేవి అయిన రహస్యాలను తన కళ ద్వారా తెలియ పరుస్తాడు. అతనికి మేధస్సే కాని హృదయం లేదు.

అయితే నాకు కళను చూసి కరిగే హృదయముండి కన్నీటిని చూసి అది కరుగక పోవడం అసంగతంగా కనబడుతుంది. కళకు, మానవతకు విడదీయరాని సంబంధం వుంది. హృదయమున్న చిత్రకారుడు గీసిన చిత్రానికి, కెమేరాతీసే బొమ్మకు తేడా ఏమిటి? యాంత్రికంగా, మానవ సంబంధమైన జాలి, కరుణలతోటి, మిగితా విలువతోటి నిమిత్తం లేకుండా సృష్టించే కళలో 'సోల్' కనబడదు. సృష్టించని, కేవలం రసానుభూతి పొందేవాడికి కూడా ఈ సూత్రం వరిస్తుందని నా నమ్మకం.

పన్నెండు దాటింది. భోంచేద్దాం రండి అని పిలిచాడు. శేషాచలం. భోజనాల ముందు భార్యను పరిచయం చేశాడు. పేరు శారద. పావుగంటలో భోంచేసి వచ్చి ఉపక్రమించగానే నిద్రలోకి జారిపోయాను.

* * *

నిద్ర బాగా పట్టేంది. మత్తుగా ఇంకా నిద్రపోవాలని వుంది. తిరిగి ముసురుతున్న నిద్రని బలవంతాన పార్రదోలి మంచం మీద నుంచి లేచాను. నిశ్శబ్దంగా వుంది. ఇంట్లో అలికిడి లేదు. వరండాలోకొచ్చాను.

ఇంటిముందు మెట్లమీద శారద. పై మెట్టు మీద కూర్చుని కాళ్లమీద దాని కింది మెట్టుమీద మడిచి వుంచి కూర్చునివుంది. ఇటు ప్రక్క కాలు గుండ్రంగా బలంగా వుండటం చూసిన ప్రాయంగా తెలుస్తోంది. శరీరపు బలాన్ని తెలియజేస్తోంది తుంటిభాగం. లోపలికి ఒదిగి వున్న పొత్తి కడుపు తెల్లటి శరీరం. వదులుగా అల్లిన వెడల్పాటి జడ వీపు మీదుగా పాకి నేలను తాకుతోంది. దీర్ఘాలోచనలో వుందామె. ఎదురుగా నుదుట నల్లమచ్చ వున్న తెల్లటి కుక్క, పొట్టిగా లావుగా వుంది. చెవులు పొడవుగా వున్నాయి. ఆమె చేతిని మారాంచేస్తూ నాకుతోంది. ప్రేమ పలకపోస్తు చెవులు తోకా ఆడిస్తోంది. పొడవాటి తెల్లటి వేళ్ళు లేత గులాబి రంగుగోళ్లు కనిపిస్తున్నాయి. నీలం గాజులు. సగం కనిపిస్తున్న ముఖంలో విచారంకలబోసిన ఆలోచనా ముద్రా. అన్నా సర్జియేవ్నా (లేడీ విత్ ది డాగ్) గుర్తుకొస్తోంది. ఆలోచనలో (ఫర్‌లార్న్‌గా) వున్న ఆమె తల తనవైపు తిప్పదన్న ధైర్యంతో కొద్ది క్షణాలు వరండాలో నిలబడి చూశాను. తర్వాత గది గుమ్మం దగ్గర చెల్లి పాదాల చప్పుడు అయ్యేలా నడుస్తు తిరిగి వరండాలో కొచ్చి గొంతు సవరించుకుంటే, ఆమె సర్దుకుని కుక్కను దూరంగా తోసి నిలబడింది, నా వైపు తల త్రిప్పి చూసి. ముందుకు నడిచాను.

'శేషాచలంగారు వెళ్లి పోయారా అండి?'

'అవునండి, రెండు గంటలవుతుంది వెళ్లి...కొండన్న ఇపుడే వస్తానని వెళ్లేడు. చాలా సేపయింది. అయిపు లేదు. కాఫీ తెస్తానుండండి.'

స్పష్టంగా ముఖం చూసే వీలయింది. విశాలమైన నుదురు. పెద్ద కళ్ళు. కొసలు దాటి కాటుక పెట్టడం వల్ల ఇంకా పెద్దవిగా కనిపిస్తు. నొక్కుల జుత్తు. నల్లగా, ఒంకీలు తిరిగి, పెదవులు, గోళ్ల లేత గులాబీ రంగులో వున్నాయి. నుదుటి మీద యడమ కంటిపైన మానుతున్న గాయం.

మొహం కడుక్కుని వచ్చేసరికి కాఫీ తెచ్చింది.

'అదిగో కొండన్న వస్తున్నాడు. అలా వెళ్లిరండి.' చిరునవ్వుతో అన్నది.

పావుగంట తర్వాత కొండన్నా నేను వ్యాహ్యాళికి బయలుదేరాం.

కొండవాగులో కాఫీ చెట్లు చూపించాడు. బారులు తీరిన కొబ్బరి చెట్లమధ్య మంచి రాలిన పూవులు తొక్కుతూ గాలికివూగే చెట్ల ఆకుల చప్పుడు వింటూ నడిచి మావిడి తోటలోకి వచ్చాం. దూరంగా కొల్లాయిగుడ్డలు కట్టి, తలపాగలు చుట్టిన సేద్యగాళ్లు. అరిక దున్నటం కనబడుతోంది. దున్నబడిన ముక్కపొడి రంగు కయ్యలు.

పెద్దరాతిబండ మీద ఒక మామిడి చెట్టుకింద కూర్చోమన్నాడు వాడు. వాడు చెప్పినట్టు చేశాను. ఒంటికంటితో చూస్తున్నాడు మామిడి చెట్టును. అసలే రెండు చేతులుకూడా చాలనంత పెద్ద సైజుబంగిని పల్లి కాయలు. ఆ సైజు చాలన ట్లు అన్నిటికన్నా పెద్ద దాని కోసం ఆ కన్ను వెదుకుతోంది. కావడానికి ఒకటే కావచ్చు ప్రపంచమంత కరుణ నిండిన చూపును ప్రసరిస్తోంది. ఆ ఒక కంటి కరు ఎక్కువ. రెండెండు

కన్నట్లు రెండో కన్ను పోయింది.

చివరకు ఆ కంటికి వచ్చిన కాయ దొరికినట్లుంది. ఎత్తుబండ వేసుకుని ఎక్కి దింపాడు. విజయ గర్వంతో నా చేతికందించాడు.

'ఎండా, వలీ రెండు ఎక్కువలా వుందయ్యా మీ వూళ్లో' అన్నా.


ఎండ వేడిమికి తమ పీల్చుకున్న చల్లటి నీడనిస్తోంది మామిడిచెట్టు. ఎండుటాకుల్లో కూర్చున్నాను. వెనక్కు చేతులు రెండు ఆనించి, బరువంతా వాటికి బదిలీ చేసి.

'అదుగో రాయి' వేలుతో చూపించాను నాలుగడుగుల దూరంలో తెల్ల పలుగురాయిని. ఆ కంటికి కరుణే బరువైన కంటికి చెదికే శ్రమ ఇవ్వడం ఎందుకన్నట్టు మామిడికాయ కోయగానే వాడు దేనిగురించి చూస్తాడో ముందుగానే ఊహించి.

'రెండూ ఎక్కువేనండి. అయినా చక్కటి వూరు.' రాయి తెస్తూ, అన్నాడు.

నేలలో కూరుకుపోయిన పెద్ద బండమీద కాయ నుంచి తెచ్చిన దానితో బద్దలుకొట్టాడు. కొబ్బరికాయలా పగిలింది. నవ్వులా తెల్లదనం రెండు చిప్పలలో.

'అసలు రెండేళ్ల వాడయితే వరుగుడు, మావిడి,




ఒక యువ మేజర్ హోటల్ లాబీలో పూర్తి నగ్నంగా ఓ స్త్రీని వెంటాడుతూ పట్టుబడిపోయాడు. అయితే అతని లాయర్, మిలటరీ అధికారి, వారి ఆటకు సరిపడే దుస్తులు వేసుకుంటే చాలు యూనిఫారంతో ఆటలు ఆడక్కర లేదనే ఆర్మీ మాన్యువల్ నిబంధన చూపి అతన్ని విడుదల చేయించాడు.

ఆర్.బి

టేకు ఒకటేంటి (అసలు మావూళ్లో దొరకని చెట్టు లేదు) విపరీతంగా వుండేది. కొట్టెయ్యడం అమ్మెయ్యడం ఎక్కువయింది. కొత్తచెట్లు మొలవడం కన్న చెట్లుపోవడం ఎక్కువ. జనానికి డబ్బుపిచ్చి ఎక్కువైంది. చెట్లు పల్చబడి పొయ్యాయి. అందుకే ఈ మధ్య ఎండ ఎక్కువవిపిస్తోంది.'

రెండు ముక్కలు కొరుక్కుని రెండు బుగ్గలకు తోసి నవులుతూ అన్నాను' అవును, నీ కంటికేమయింది.?'

వినిపించుకోలేదు. 'ముంజల్తింటారా?' అడిగాడు. 'ఎందుకులే' అన్నా మొహమాట పడుతూ. 'ఫరవాలేదు తెస్తానుండండి' అన్నాడు, మామిడి ముక్క నములుతూ నవ్వుతూ (వాడి మామూలు నవ్వుకన్నా ఎక్కువగా).

'ఏం.. నవ్వుతున్నావ్?'

'మా అమ్మగారు గుర్తుకొచ్చి.'

'ఎందుకు గుర్తుకొచ్చారు.'

'మీలాగేమొహమాటం' అమ్మగారూ! సాయంత్రం ముంజలు తెస్తానన్నామకోండి. ఎందుకులే అంటారు. అమ్మగారూ! చెరుగ్గడలు పీక్కొస్తానన్నాననుకోండి 'ఎందుకులేరా ' అంటారు. పిల్లిపెసర కాయలో, సీమ చింతకాయలో తీసుకెళ్లాననుకోండి 'ఎందుకురా పాపం ఇవన్నీ తెస్తావు... ఇదీ వరస.

'అవునూ. ఆమెకేమైనా దెబ్బతగిలిందా మదుటి మీద.'

'ఆ పది రోజులనాడు.'

'ఎక్కడ, ఎందువల్ల' యధాలాపంగా అడిగాను.

'ఉండండి తాటికాయలు కోస్తా'

'ఎందుకోయ్ అవన్నీ' అని వెనకనించి కేకలేస్తున్నా వినిపించుకోకుండా పరిగెత్తాడు.

ఏ ప్రశ్నకు వాడు సూటిగా సమాధానం ఇవ్వడు. కుర్రతనం వల్ల అయివుంటుంది. ముఖ్యంగా శేషాచలం భార్య గురించి నాలుగైదు విషయాలు అడగాలని వుంది. కొంత మొహమాటంగా వుంది. అంత సభ్యత కాదు కూడా. కొండన్న పసిపాప కాదు. పదిహేను, పదహారేళ్ల వయస్సు. తొమ్మిదో క్లాస్ చదువుతూ మానేశాడు. అపరిచితుడు ఆమె గురించి ప్రశ్నలేస్తే వింతగా భావించని వయసు కాదు. ఒక వేళ ఆమె గురించి గానీ తన జీవితాన్ని గురించి గానీ ఏ ప్రస్తావన వచ్చినా అయిష్టమవు తుందేమో ముచ్చటించడానికి. అందువల్లే కంటి విషయం కూడా కప్పదాటేశాడు.

కాళ్లకు బంధం (దాని పేరేదో మరిచి పొయ్యాను) తగిలించుకుని ఉడుతలా పైపైకి పాకుతున్నాడు. పడదు కదా. కరుణ, ఆరాధన (ఉడుత గుణాలే) మూర్తీభవించినట్లుంది వాళ్లే చూస్తుంటే ఆ క్షణాన మామిడి కాయలు తాటి ముంజలు సమర్పించుకోవడం. పది నిముషాల్లో చెట్టుదిగి కిందకు వచ్చాడు.

'మీ ఊరు నచ్చిందయ్యా ఉండి పొమ్మంటావా?'

'వారం రోజులు గడిపితే మీకే మొహం మొత్తి జైలులా అనిపించి పారిపోవాలనుకుంటారు'

'విషయాలు బాగా తెల్సిన వాడిలా మాట్లాడుతున్నావోయ్.'

' మా అమ్మగారంటూ వుంటారు అపుడపుడు. ఈ ఊరు జైలులా వుంది. పారిపోవాలని వుందిరా అని.'

ఆ మాటలు కొంచెం విచిత్రమనిపించాయి.

వాడికి ఒళ్ళంతా తడిసి పోయింది చెమటతో. చొక్కా తీసి వేయబోయి గబుక్కున ఆగి పోయాడు నా ముఖంలో చూస్తూ వాడి భావం అర్థమైంది.

'ఫరవాలేదు తీయవోయ్, పెద్ద మొగాడివే గానీ'

చొక్కా తీయలేదు.

'ఆమె చదువుకున్నారా?'

'ఆ ' అన్నాడు. ముంజలు తీసి పచ్చి తాటాకు మీద పెడుతూ తినమన్నాడు. చెమటలు పట్టిన ముఖం మీద మునపటి చిరునవ్వు తిరిగి వెలిగింది. కళ్ళెత్తినన్ను చూశాడు. అన్నెందుకురా అనబోయి వూరుకున్నా. భావం అర్థం చేసుకుని నవ్వాడు. నేనూ నవ్వాను ముంజలు అందుకుంటూ.

కంటి గురించి అడిగారు కదా! అయిదా రేళ్ళయింటాయినాకు. మా అన్నవుండేవాడు. నాకంటే మూడేళ్ళు పెద్ద. కొబ్బరి కాయవొలుస్తున్నాడు ఒకరోజు ఇనప చువ్వతో దానికి రెండు వైపులా సూది మొనలున్నాయి. ప్రక్కనే గొంతుకూర్చుని చూస్తున్నా. ఎపుడు దిగబడిందో కంట్లో తెలీదు. రెండు రోజులు స్పృహ లేదంది అమ్మ. దాన్ని గురించి వాడిని అమ్మా నాన్న తిట్టని రోజూ లేదు, కొట్టని రోజులు లేవు.'


'అతనేం చేస్తుంటాడిపుడు.ఈ ఊళ్ళోనే ఉన్నాడా' 'లేదు ఇపుడు లేడు.తర్వాత నాలుగేళ్లకు ఇంట్లో వాళ్లతో గొడవ పడ్డాడు. కేకలేసి కొట్టేదు. పొద్దున పొలం బావిలో తేలుతున్నాడు. మరుసటి రోజు. ఆ తర్వాత కొద్దినెలలకే అమ్మా నాన్న ఒకళ్ల తర్వాత ఒకళ్లు దిగులుతో మంచమెక్కి పొయ్యారు. నేనొక్కడినే మిగిలా.'

కొద్ది నిముషాలు అచేతనంగా వుండి పొయ్యాను. కొంతసేపటి తర్వాత ఇంటికి బయలుదేరాం. వెలుతురు పుల్లల్తో ప్రకృతి కొండ మీద గూడు కడుతోంది.

కుడివైపు తిరగగా వచ్చిన వీధిలో మేకల మంద రోడ్డంతా ఆక్రమించి మమ్మల్ని దాటి వెళ్లిపోయింది మట్టిరేపుకుంటు. ఎత్తుఅరుగులున్న పెంకుటింటి ముందు పాలు పితుకుతోంది అరవైసంవత్సరాల వృద్ధురాలు. గేదెముందు చేటపెయ్యి. గో పిడకలు కొడుతుంది చీర ఎగకట్టుకున్న బలైమైపిక్కలుగల స్త్రీ. కొంచెం దూరంలో బొడ్డు మొపలాయన మరొ గేదెకు పాలు పితుకుతున్నాడు. పొదుగు నుంచి పగ్గాలు తెంచుకున్నట్లు పాల దార చెంబులోకి దూకుతూ రాగం తీస్తోంది.

రాతి స్తంభాల వసారాలో పొగచూరిన దీపపు గ్లాసును ముగ్గుతో తుడుస్తోంది ఎనిమిదేళ్ల పిల్ల. కరెంటు తెచ్చిన వెలుతురు , మూనె దీపాలు పూర్తిగా పారద్రోల లేక పోతున్న చీకటి, పాకలు. మిద్దెలు, పెంకుటిళ్లు, మట్టిగోడలు, సిమెంటు, సున్నపుగోడలు, పిడకలు స్టౌలూ— ఎదుగుదల, ఎదుగుదల లేక పోవడం రెండూ కలిసిన వూరు. ఇళ్ళు ఒకదానివి ఆనుకుని మరొకటి లేవు .అంతగా. ఎడంఎడంగా వున్నవే ఎక్కువ. కొన్ని చోట్ల ఇంటికి ఇంటికీ మధ్య చాలా ఖాళీ స్థలం, చెట్లు పిచ్చి మొక్కలు పొదలు.

ఇంటికొచ్చే సరికి శేషాచలం వచ్చి వున్నాడు. వరండాలో పడక కుర్చీలో పడుకుని, చేతులు కిందకు వ్రేలాడేసి కూనిరాగం తీస్తున్నాడు. కొండన్న జారుకున్నాడు. లోపలి గదిలో నుంచి వరండాలోకి చూసే కిటికీ వెనుక శారద ముఖం కనపడింది. కొద్ది క్షణాల పాటు. అతను కుర్చీలో పడుకుని ఎదురుగా బల్ల వేసుకుని కాళ్ళు పెట్టుకుని చేతులు వ్రేలాడేసిన భంగిమ చాలించి, కాళ్లకిందకు పెట్టుకుని చేతులు ఒళ్లోకి



తెచ్చి 'రండి,రండి' అన్నాడు.ఎదురుగా వున్న స్టూలు ను చేత్తో ముందుకు తోసి 'కూర్చోండి' అన్నాడు కూర్చున్నాను.

'వెట్టూ చేమలూ మాశారా' అన్నాడు నవ్వుతూ.

తలుపాను. కొద్ది క్షణాలు దొర్లిన తర్వాత—

'తంజావూరు ఎప్పుడైనా వెళ్లారా మీరు?'

'రెండేళ్ల క్రితం వెళ్లా. నాకు అదే మొదటిసారి వెళ్లడం నాకు విచిత్రం అనిపించిన విషయం ఈ ఊరులో ఎప్పటినుంచో సంబంధం వున్నట్లనిపించ డం. ప్రతి సందు గతంలో ఎపుడో మాసి వున్న అనుభవం. త్యాగయ్య కచేరీలో తల ఊపిన జ్ఞాపకం.

పశువులు తోలుకు పోతున్నా రెవరో. మెడలోని మువ్వల రవళి. అటుసక్క మాసి నా వైపు తల తిప్పి తిరిగి ఆ సంవత్సరపు త్యాగరాజోత్సవాల వివరాలు అరగంట సేపు చెప్పాడు. పూర్తిగా చిక్కగా చీకటి అలుముకుంది. ఆకాశం రంగు మార్చుకుంది. రాబో యే చంద్రుడి గురించి సూర్యుడితో గడిపిన అనుభవాల గుర్తులు తెలీకుండా.

'సంగీత కారుడన్న ప్రతి వ్యక్తి సంవత్సరానికి ఒక రోజు మిగతా సంగీతజ్ఞులతో గడపాలి అక్కడ. త్యాగయ్య పీల్చిన గాలి పీల్చాలి. అది వాళ్లందరి మొక్కు.'

అతని తాదాత్మ్యం మాస్తే తన భావాలు నాతో పంచుకుందామన్న ఉద్దేశంకన్నా తనలో మెదిలే ఆలో చనలు తనకే చెప్పుకుంటున్నట్లుంది. భావపరంపర లు, ఒకదానితో ఒకటి సంబంధం ఉన్నవీ లేనివి.

"అన్నట్లు కొందరి జీవితాలు గురించి ఆలోచిస్తే సంగీతం, విజానికి కళకు విచారానికి గల అవినాభావ సంబంధానికి అవి దృష్టాంతాలని అనిపిస్తుంటుంది"


సంగీత సంబంధమైన విషయాలన్నా ఆమెతో మాట్లాడతాడా? ఇద్దరూ ఒక కప్పుకిందున్నా ఎవరి ప్రపంచంలో వాళ్ళదేనా జీవనం. అవసరార్థ వివాహ మా? బహుశా అందుకేనేమో ఈ పంజరం నిండి ఎగిరిపోయే మార్గం గురించి ఆలోచించడం. ఇంత వరకు నాకు కలిగిన తక్కువ అనుభవంలో భార్యతో చాలా ముభావంగా వ్యవహరిస్తున్నట్లనిపించింది. నా ఆలోచనలు సరైనవి కాకపోవచ్చు కూడా.

"కొండా, వడ్డించమని చెప్పు"

కుర్చీలో నుంచి లేచి "పదండి. బట్టలు మార్చు కుని కాళ్ళు కడుక్కోండి భోం చేద్దాం"

నా గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని, వరండాలో కొండన్న పెట్టిన నీళ్ళ చెంబు తీసుకుని ఇంటిముందు వేసిన నాపరాతిమీద కాళ్ళు కడుక్కుని, తుడుచుకుని భోజనాలగదిలోకి వెళ్ళాను.

పింగాణీ ప్లేట్లనిండా మల్లెపూలలాంటి అన్నం పొగ లు గక్కుతోంది. ఎర్రటి ఆవకాయ, బంగాళదుంప చిప్స్, పప్పుపులుసు, అప్పడాలు, పొడవుగా, సన్నగా అందంగా వున్న గాజు గ్లాసులో నీళ్ళు. గాజు కూజాలో బల్లకు ఒక పక్కగా పెట్టిన నీళ్ళు. చిన్న పింగాణీ కప్పు లో ఉప్పు, స్టీలు చంచా, కోసిన నిమ్మకాయ, ఉల్లిపాయ ముక్కలు ఒక ప్లేట్లో. ఏదీ అడగవల్సిన అవసరం



లేకుండా అమర్చబడ్డాయి. గదిలో మూలగా ఆమె నిల బడింది. ఒకక్షణం ఆమెను చూశాను. భోజనం పూర్తి అవుతున్నా అతను ఆమెను పిలిచి ఏమీ అడగలేదు. శిల్పంలా ఆమె నిలబడి ఉంది.

"మీ ఎస్టేటు బాగుందండి. ఈ చక్కని అనుభ వానికి ధన్యవాదాలు".

"మా యజమాని విదేశాల్లో ఎక్కువ కాలం గడు పుతాడు. కొడుకులిద్దరూ విదేశ వాసులు. ఆయనకు మొత్తం ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకు మెరైన్ ఇంజనీర్‌గా పనిచేసేవాడు. బాగా సంపాయించేవాడు. తండ్రికి పైసా పంపేవాడు కాదు. సిగరెట్, కాఫీ, వక్కపొడిలాంటి అలవాట్లు లేవు. ఒకటే వ్యసనం తాగుడు. ఒంటరిగా డెక్ మీద తాగుతూ తాగుతూ ఒక చీకటి రాత్రి గుండె ఆగి చనిపోయాడు అనుభవిం చింది చాలన్నట్లు. తండ్రికి కొడుకు శవాన్ని చూడ్డా నికి కూడా కుదర్లేదు. ముసలాయనకు చచ్చేంత ఆస్తి వుంది. దానిమీద సంపాదనా వివరాలు చూసుకోడానికి వస్తాడు ఇక్కడికి. అతని గురించి వాడకుండా మూడు గదులు తాళంవేసి అట్టేపెట్టి ఉంచుతాం. నాకు శ్రమకు తగ్గ ప్రతిఫలం ముట్టజెబుతాడు. ఈ ప్రాం తాలకు వచ్చాడు ఈ మధ్య. ఇక్కడికి రాకుండానే వెళ్ళి పోతున్నాడు. డబ్బుతో కలవమని ఉత్తరం రాశాడు. ఆ పనిమీదనే ప్రొద్దునంతా తిరుగుతున్నా. డబ్బు సమ కూరింది. ప్రక్క ఊరు స్టేషన్‌కు రేపు పొద్దునే వెళ్ళి రైలుకు అందజేయాలి" మంచినీళ్ళు తాగడానికి ఆగా డు.

కొంచెంసేపు ఆగి నెమ్మదిగా నవ్వాడు. "ఏం" అన్నట్లుగా చూశాను.

"మా యజమానిని నన్ను దగ్గరకు చేర్చింది సం గీతమే—మన ఇద్దరిలా".

"మీ పాట వినపడకుండానే వెళ్ళిపోవాల్సి వస్తోంది నేను".

"ఈసారి మనం కలిసినప్పుడు తప్పక విందురు గాని".

భోజనమైన తర్వాత "మజ్జిగ తే", "అరటిపళ్ళు అందుకో" అన్నవి మాత్రమే అతను ఆమెతో మాట్లా డిన మాటలు.

ఇంటిముందున్న కుర్చీలలో కొంచెంసేపు మాట్లా డుకుంటూ గడిపాం.

"తెల్లవారు ఝామునే వెళ్ళిపోవాలి. త్వరగా పదు కుంటా. ప్రొద్దున మిమ్మల్ని లేపడం ఎందుకు. ఇప్పు డే వీడ్కోలు తీసుకుంటా. మరోసారి రాకూడదు. ఇప్పుడు మీరు వచ్చినట్లే లేదు. మనం కలిసి గడపడం పడలేదు ఈ ముసలాయన కారణంగా. ఏమీ అనుకోరు కదూ? మిమ్మల్ని బస్సు దగ్గరకు కొండన్న దిగబెడ తాడు రేపు"

కుర్చీలోనుంచి లేచి నా చేతులు రెండూ తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కాడు.

"ఫరవాలేదు. బాధపడకండి. ఈ విధంగా అవాం తరం వస్తుందని మీరూ కలగనలేదు కదా. నాకూ మరో రోజన్నా వుందామంటే ఊరు వెళ్ళాల్సిన పని బడింది".


నేను నా గదిలోకి, అతను అ[illegible]దిలోకి వెళ్ళి పోయాం. కుర్చీ కిటికీ దగ్గరకు [illegible]క్కని కూర్చున్నా లైటు తీసేసి. ఊరు సద్దుమణిగింది. అసలే అర్థచంద్రు డు. గాజు మబ్బు పొరలలో చిక్కుకున్నాడు. వెన్నెట్లో ఇప్పుడు చీకటి కర్తే ఎక్కువైంది. కాని పరిసరాల సౌం దర్యం మాత్రం అధికమైంది. మేలి ముసుగులో కం టికి కనపడేదే కాకుండా, కనపడని అందం. ఇంకా ఏదో అధికమైన అందం కనపడటం లేదన్న భావన కలిగి స్తూ. ప్రకృతి నగ్నత్వానికి మేలి ముసుగు. చల్లదనం,




జబ్బున పడి ఈవాళో, రేపో అన్న స్థితిలో ఉన్న భార్య "ఒక వేళ నేను చచ్చిపోతే, మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి, కానీ నాకో మాటివ్వండి. నా బట్టలను మాత్రం నీ రెండో భార్య వేసుకోనివ్వనని మాటివ్వం డి" అని కోరింది.

"అలాగే తొడుక్కోనివ్వను, అసలు అవి ఆమెకు పట్టవులే" అని నాలిక్కరుచుకున్నాడట భర్త గారు.

—ఆర్.బి




మంచుస చెమ్మగిల్లిన గాలి లోపలికి తోసుకొస్తూ. చిన్నప్పుడు, ఆరేళ్ళప్పుడు పీల్చిన ఏదో తెలిని పూల పరిమళం. ఇన్నేళ్ళ తర్వాత—ఇంతకాలం ఆ పరిమళం ఏమైంది. మసు చీకట్లో కుడివైపు చెట్టు కొమ్మలు ఏదో ''వద్దు'' అని చెబుతున్నట్లు కదులుతున్నాయి. చేత్తో కిటికీ రెక్కలు తాకేను. చల్లగా, తేమగా ఉన్నాయి. ఇనప కమ్మీలకు చెంప ఆనిస్తే చల్లదనపు హాత. నిద్రరావడంలేదు. అది ఎప్పటి జబ్బే. కాకపోతే ఇప్పుడు మనసును ఆవరించిన కొత్త అనుభవం. సాయంత్రం ఏటవాలు ఎండలో, గుమ్మంలో కుక్క చెవులు నులుముతూ, తదేకంగా ఎక్కడికో చూస్తూ, ఆలోచనా ముద్రలో వున్న ఆమె ముఖకవళికలు గుర్తుకొచ్చాయి. ఈ అడవిలో వుండిపోవాలని ఉంది. నిశ్శబ్ద సంగీతం—ఎల్లడలా ఆవరించి. కిటికీ దగ్గర నుంచి మంచం పక్కనున్న స్టూలు దగ్గరకొచ్చాను. కూజా మంచుముక్కలా ఉంది. ఆప్యాయంగా ఘనీభవించినట్లుంది. నీళ్ళు గ్లాసులోకి వంపుకుని తాగాను. గదిలో వెలుగు ఎక్కువైనట్లుంది. కిటికీలోంచి చూస్తే వెన్నెల విజృంభించడం కనిపిస్తోంది. ఒంగి కిటికీలోంచి గదిలోకి చూస్తున్న ఆకాశానికి అంటుకుని ఉన్న చుక్కలు. ఆకాశంలో తమ ఉనికికి అర్థం తెలీక వెలవెలబోతున్నట్లు. నక్క దూరంగా పాడే పాటకు కీచురాళ్ళ తాళం. శేషాచలం నిద్రబోతుంటాడు—ఈ సమయానికి గాఢంగా. కలలో కోటి కచేరీలు వింటుంటాడేమో. వేలాది వీణలు, మృదంగాలు, గొంతులు, దివ్యలోకపు వాయిద్యాల సంగీతం. కల చెదరకుండా, వాస్తవంలోకి జారకుండా. మస్తిష్కంలో అద్భుతమైన రంగుల కలయికతో దివ్య చిత్రాలు ప్రదర్శింపబడుతుంటాయి. విసుగు కలిగినపుడు టాల్‌స్టాయ్, ఛెకోవ్, దాస్తొవిస్కీ, గోగోల్, జోలా, మొపాసాలు స్వీయ రచనా పఠనాలు చేస్తారు. మంచంమీది దుప్పటి పూలు చీకటి కాని చీకట్లల్లో మరకల్లా ఉన్నాయి. ఎంతకాలం గడిచిందో తెలీదు మంచంమీద కళ్ళు తెరిచి పడుకున్నాను.

దభీమని శబ్దం వినపడినట్లయింది దూరంగా. భ్రాంతి అనుకుంటుండగా కొద్దిక్షణాల తర్వాత తిరిగి అదే శబ్దం. ఏ దిక్కునుంచి వచ్చిందో తెలీదు. జాగ్రత్తగా వింటే ప్రక్క గది నుంచి వినిపిస్తున్నట్లుంది. ఎవరిదో గొంతు వినపడుతోంది. శబ్దానికి శబ్దానికి మధ్య టైం ఎంతయ్యుంటుందో వాచీ చూడాలనిపించలా. చూస్తే నిద్ర అసలు పట్టదు గడవాల్సిన కొద్ది గంటలన్నా. అవతల జరుగుతున్నదేమిటో తెలుసుకోవాలన్న ఉత్సుకత ఉండనీయడం లేదు. ఇంటికి కుడి పక్క ఖాళీ స్థలం ఉంది. ప్రహారీగోడకు ఇంటికి మధ్య. అటు ప్రక్కనుంచి కిటికీ ఉండి ఉంటుంది. మంచం మీద నుంచి లేచాను. గది తలుపు తీస్తే చల్లటిగాలి ఒక్క ఊపుతో లోపలికి తోసుకొచ్చింది. బయటికొచ్చి వెనకగా మూస్తుంటే గోడకు తలుపుకు మధ్య గాలి నలిగింది. ఒక క్షణం ఏదో అడవి పూల పరిమళం. వెన్నెల వెలుగులో నల్లపిల్లి గోడ ఎత్తును అంచనావేసి దానిమీదకు ఎగరడానికి ఎంత ఊపిరి అవసరమో అంతా పీల్చి, నేలను తన్నిపెట్టి ఎగిరింది. గోడ మీదకెక్కి సగర్వంగా వెనక్కు తలతిప్పి చూసి ఎడమవైపుగా గోడ మీద నుంచి నడిచివెళ్ళిపోతోంది. ఇంటికి కుడివైపు నున్న ఖాళీస్థలం గడ్డి మొలిచి తివాచీలా వుంది. అనుకున్నట్లే ఆ గదికి కిటికీ ఉంది. గదిలో వెలుతురు కిటికీ గుండా వచ్చి గడ్డిమీద వాలుతోంది. ఈ రాత్రి పూట మేలుకుని ఉన్నారెందుకో. శేషాచలం ఎక్కడికో వెళ్ళాలని చెప్పాడు కదా అందుకే త్వరగా లేచి ఉంటాడు. తను విన్న శబ్దాలు నిజమైనవేనా, నిద్ర లేని అలసట మనసు కల్పించినవా అన్న అనుమానం కలిగింది. ముందుకు నడిస్తే ఏ ఎండిన ఆకో కాలికింద పడి అలికిడి అవవచ్చు. గదిలో వాళ్ళ కిటికీలో నుంచి తొంగి చూడొచ్చు. ఇబ్బందికరమైన విషయం అవుతుంది. వెనక్కు తిరిగి వెళ్ళడం మంచిది. మిగతా విషయాలెలా ఉన్నా అర్ధరాత్రిపూట గదుల దగ్గర పొంచి ఉండటం, తొంగి చూడటం మర్యాదకాదు గదా. ఇలా సందిగ్ధంలో వున్న సమయంలో కాళ్ళు మాత్రం కిటికీకి రెండు అడుగుల దూరానికి లాక్కుపోయాయి.

ఆపుకుంటున్న ఏడుపు. మళ్ళీ ఇందాకటిదే శబ్దం. శరీరంలో మాంసం ఎక్కువగా ఉన్న భాగాల మీద కర్రతో బాదిన చప్పుడు. సాధ్యమైనంతగా తగ్గించిన గొంతుతో మాట్లాడుతుండడం తెలుస్తోంది. ఆ కంఠస్వరంలో కోపం స్పష్టంగా తెలుస్తోంది. వెక్కిళ్ళు. నోట్లోకి గుడ్డ కూరుకుని ఆపుకుంటున్నట్లు. రెండు కంఠస్వరాలు ఎవరివో తెలుస్తోంది. అసలు విషయం అర్థమైంది. తొంగిచూసి తెలుసుకోవాల్సిన అవసరం లేదు.

మామిడి చెట్టు క్రింద కొండన్న ఆమె అన్నట్లుగా చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. ఇటువంటి చోట నత్తలా నడిచే, ఒంటరితనపు తోడని కాలం కలిగించే విసుగులో అన్నమాటలే అవి అని అనిపించింది అప్పుడు. ఇప్పుడు కాదు అవి తెలుస్తోంది. మొగుడు, పెళ్ళాం (సంతానం కలగలేదు) నిశ్శబ్ద ప్రపంచంలో సరైన నాగరికత లేని ప్రదేశంలో గడపడం కష్టమైన విషయమే. ఒకవేళ ఆ ఇద్దరి మధ్యా సరైన సయోధ్య లేకపోతే ఎవరి ప్రపంచంలో వాళ్ళు లంకంత ఇంట్లో గడపవలసి వస్తే ఇంక చెప్పాలా. నిన్న సాయంత్రం ఆమె కనిపించిన తీరులో ఆమె మానసిక స్థితి తెలుస్తోంది. ఇప్పుడు ఇదుగో ఈ చేదు నిజం. వెనక్కొచ్చి మంచంమీద వాలి, ఆలోచనలన్నింటిని కొద్ది క్షణాలు మనసులోనుంచి పారద్రోలడానికి ప్రయత్నం చేసి, కళ్ళు మూసుకోంగానే వెర్రి నిద్ర ముంచేసింది.

మెళకువ వచ్చేసరికి బాగా తెల్లారి ఎండెక్కింది. వాచీ చూస్తే 8 గం. వరండాలోకి రాంగానే కొండన్న తయారూగా ఉన్నాడు. బస్సుకు టైం అవుతుందని కొద్ది నిముషాలాగి లేపుదాం అనుకుంటున్నాడట. కాలకృత్యాలు ముగించుకొచ్చేసరికి అరగంట పట్టింది. ఫలహారం తీసుకుని ఆమె వస్తుందేమో, రాత్రి సంఘటన గుర్తుకొచ్చి ఆమెతో ఎలా మాట్లాడాలా అన్న సందిగ్ధంలో పడ్డాను. కానీ రాలేదు. కొండన్న ఫలహారం పట్టుకొచ్చాడు. పెద్దవి, ఉల్లిపొరలలా వుండి, గోధుమ రంగులో కాల్చబడ్డ పెసరట్ల దొంతర. ఉల్లిపాయ ముక్కలు, అల్లం పచ్చడి. రాత్రి ఒక కలలా తోచింది. అసలు శేషాచలంతో పరిచయం, తక్కువ పరిచయంతో ఇక్కడకు రావడం, రాత్రి అనుభవం అంతా ఒక కల, కథ. కొండన్న కాఫీ పట్టుకొచ్చాడు.

''మీ పెట్టె సర్దేదా?''

''సర్దడానికేముంది, సరేకానీ''

కూనిరాగం తీస్తున్నాడు. తనగానం తాను విని ఆనందిద్దామన్న ఉద్దేశంతోనో, మనసులని సంతోషాన్ని కూనిరాగంద్వారా వ్యక్తంచేద్దామనో. కాఫీ తాగుతూ పరికిస్తుంటే ఆనంద చిహ్నాలు కనపడటంలేదు.

ఆమె విచారగ్రస్తంగా వుండి ఉంటుంది. రాత్రిది గతంలో అనేకసార్లు జరిగిన సంఘటనలలో ఒకటైంది. అలవాటుపడి ఉంటుంది. గతంలో ఏమీ ఇలాంటివి జరగకుండా ఇదే మొదటి అనుభవమేమైతే? రాత్రి శేషాచలం చర్యకు బలమైన కారణం?

''బస్సు దగ్గరకు నడిచి వెళ్ళడానికి పావుగంటపడుతుందికదా?''

అవునన్నట్లు తలవూపాడు. టైం ఆట్టేలేదు. గుమ్మం దగ్గర గాజుల శబ్దం అయింది. ఆమె వచ్చి నిలబడింది. కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాను. కొద్దిగా తలవంచుకుని అన్నది.

''కొండన్న బస్సుదాకా దిగబెడతాడు మిమ్మల్ని''

''శేషాచలంగారికి ధన్యవాదాలు తెలియజెయ్యండి ఆతిథ్యానికి''.

"ఇదివరకే చెప్పారు ఒకసారి" నవ్వుతూ అన్నదామె. పవిటకొంగుతో ఇవతలి భుజాన్ని కూడా కప్పుకొని పట్టుకుని.

"అయితే ఇప్పుడు మీకు"

శేషాచలానికి, ఆమెకు, కొండన్నకు గుడ్‌బై. ఈ ఊరుతో రెండురోజులనాడు ఆరంభమైనది ఈ నిముషాన ఆఖరవుతుంది. జ్ఞాపకాలు మాత్రం మిగిలి ఉంటాయి.

గేటు తీసుకుని వీధిలోకొచ్చి "వస్తానండి" అని తల ఊపి నడవడం మొదలుపెట్టా. ఆ ఆఖరు మాట వినపడివుండదు. అన్నట్లు మాత్రం తెలిసి ఉంటుంది. తల ఊపడం కనిపిస్తుంది. మెట్లమీద పవిడ కొంగు కప్పుకుని నిలబడి ఉన్నది. "మంచిదండి" అన్నట్లు నోరు కదపడం కనిపించింది. బ్రీఫ్‌కేస్ పట్టుకుని కొండన్న త్వరత్వరగా అడుగులు వేస్తున్నాడు.

"చెప్పవోయ్ విశేషాలు".

"మళ్ళీ వస్తారా మావూరు"

"బహుశా ఉద్యోగరీత్యా వెళ్ళిపోతానయ్యా ఈ ప్రాంతాలనించి. రావడం వీలవకపోవచ్చు. నీ మామిడి కాయలు, తాటిముంజలు మరిచిపోనయ్యా".

రెండు నిముషాలు ఇద్దరం ఎవరి ఆలోచనలలో వాళ్ళం ఉండిపోయాం.

ఒక విషయం చెప్పమంటారా?"

"నాకు తెలుసు. పూర్తిగా కాపోయినా కొంతవరకు. మీ అమ్మగారు, అయ్యగారి గురించేనా?"

"ఊ"

"ఎందువల్ల మీ అయ్యగారు ఆవిధంగా ప్రవర్తిస్తుంటాడు?" ఆమె నుదుట మీద గాయం కూడా అతను పుణ్యం కట్టుకున్నదేనా?"

"అతిచిన్న విషయానికీ అయ్యగారికి చికాకు, కోపం. ఒక్కోసారి కారణం కూడా అక్కరలేదు. ఇంకొక సంగతి మీకు తెలీదు".

"ఏమిటి?"

తల అటూ ఇటూ తిప్పి ఎవరూలేరని నిర్ధారణ చేసుకుని ఆగాడు. నా కాళ్ళు ఆగిపోయాయి. నాగజెముడు, బ్రహ్మజెముడు పాదత్రోవకు కుడివైపు. తొండ పొదమీద నిలబడి ఎవరీ కొత్త వ్యక్తి అన్నట్లు చూస్తోంది. కొంచెం దూరంగా తుమ్మచెట్లు, పసుపు పచ్చపూలు. తంగేడు చెట్లు వాటి ప్రక్కనే. వాటి నిండా పసుపుపూలు.

చొక్కా వీపు పైకి లాక్కుని, వీపు చూపించాడు. ఎర్రగా మానుతున్న వాతలు. అంతకుముందు మానిన గాయాల గుర్తులు.

"విన్నారా?" అని మాత్రం అనగలిగా.

అప్పుడు గుర్తుకొచ్చాయి. వచ్చిన ఉడతలు వాటిని కొంటున్న వాళ్ళు.

మూడుగంటల ప్రయాణం తర్వాత ఒంటరితనపు చీకటి గదిలో లైటు వేస్తున్నప్పుడు కూడా ఆ జ్ఞాపకాలు వెన్నంటుతూనే ఉన్నాయి. మరో నిద్రరాని రాత్రికి నాందిగా.

○

# శుభం! శుభం! జన్మదినం

## 'హాపీ బర్త్‌డే' పాఠకవిజేతలకు ఉదయం వీక్లీ అభినందనలు



ఎ.వెంకటాచారి,
పుట్టినతేదీ: *22-7-89*
అంబర్‌పేట



పేరు: జి.లత
పుట్టినతేదీ: 23.7.89,
ఊరు: కల్వటాల



పేరు: సరిత
పుట్టినతేదీ: 24.7.89
ఊరు: మహబూబ్‌నగర్



పేరు: అపరంజిత
పుట్టినతేదీ: 25.7.89
ఊరు: హైదరాబాద్



పేరు: కె.ప్రవీణ్‌కుమార్
పుట్టినతేదీ: 26.7.89
ఊరు: హైదరాబాద్



పేరు: ఎం.కల్పన
పుట్టినతేదీ: 27.7.89
ఊరు: సికింద్రాబాద్

జూలై 22 నుండి 28 వరకు పుట్టిన రోజు జరుపుకునే ప్రియ పాఠకులు అందుకోండి ఉదయం నవతరం వారపత్రిక శుభాకాంక్షలు.



పేరు: కె.వి.సందీప్
పుట్టినతేదీ: 28.7.89
ఊరు: శ్రీకాకుళం

ఆగష్టు 11 నుండి 17వ తేదీ లోపల పుట్టినరోజు జరుపుకునే ప్రియపాఠకులూ.. మీ ఫోటోతోపాటు ఈ కూపన్ జతపరచి పంపండి ప్రచురిస్తాం.

పేరు: ————
పుట్టినతేదీ: ————
చిరునామా: ————
సంతకం: ————